జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 1 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 6

గోదావరి పుష్కరాల పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలి

- భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి
- రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 31 (,ప్రజాజ్యోతి) రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి పలు జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై

మిగతా 2 లో...

- కొత్తగూడెం మార్కెట్ పరిధిలో అక్రమ వసూళ్ల ఆరోపణల గుట్టుమట్లు!
- ఆన్‌లైన్ పద్ధతంటూ కొత్త పాట.. ఫిజికల్ కాపీలు పంపడానికే డబ్బులు అడిగారా?
- ఒక్క సుజాతనగర్‌లోనే 45 మంది కొనుగో లుదారులుంటే 13 మందే లైసెన్స్‌దారా?
- రైడ్ చేస్తే అక్టోబరు 27నే 'ప్రెస్‌నోట్' ఎందుకు ఇవ్వలేదు?

6 లో..

ఎన్ని 'కథలు'.. అల్లుతారు..?

● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల జారీ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతూ తీవ్ర దుమారం రేపుతోంది. అదనపు 'అమామ్యాల వసూళ్ల' వ్యవహారంపై నిజాలు నిలదీస్తుంటే కొందరు అధికారులు తప్పించుకునేందుకు, విషయాన్ని గందరగోళం చేసేందుకు 'ఎన్ని కథలు అల్లుతారు?' అని వ్యాపార వర్గాల నుంచి ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

నిరుద్యోగ గిరిజన యువతి యువకులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించు కోవాలి

- జీవనోపాధికి మార్గం సుగమం చేసుకోవాలి
- ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 31, (ప్రజాజ్యోతి) పై చదువులు చదువుకొని ఖాళీగా ఉండకుండా ఇష్టమైన వృత్తులలో శిక్షణ తీసుకొని వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకొని జీవనోపాధికి, ఆదాయ మార్గాలు తెలుసుకొని సొంతంగా వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ యువతులకు సూచించారు.శనివారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ప్రగతి మైదానంలోని మున్సిపల్ భవనములో ఐటీడీఏ ద్వారా గిరిజన యువతులకు వివిధ వృత్తులలో నైపుణ్యాల శిక్షణ

మిగతా 2 లో...

త్యాగాల పునాదులపై నిర్మితమైన ఏఐటీయూసీ

శ్రామిక లోకానికి కొండంత అండ

- కార్మిక హక్కుల పరిరక్షణకు దేశవ్యాప్త సమ్మెలకు సిద్ధం కావాలి: కూనంనేని సాంబశివరావు
- లేబర్ కోడ్ల రద్దు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణపై తీవ్ర ఆగ్రహం

పాల్వంచ, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి: కార్మికుల హక్కుల సాధన కోసం సాగిన శతాబ్దానికి పైగా పోరాటాలు, లెక్కలేనన్ని త్యాగాల పునాదులపై నిర్మితమైన ఏఐటీయూసీ యావత్ శ్రామిక లోకానికి కొండంత అండగా నిలుస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పాల్వంచ పట్టణంలో ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా

మిగతా 2 లో...

నాలుగు దశాబ్దాల సేవలకు వీడ్కోలు

- బారాజల కర్మాగారంలో ఆరుగురు ఉద్యోగుల పదవీ విరమణ
- జనరల్ మేనేజర్ రఫిక్ అహ్మద్ ఆధ్వర్యంలో కార్యక్రమం

అశ్వాపురం అక్టోబర్ 31ప్రజాజ్యోతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని బారాజల కర్మాగారంలో గత 40 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ తమ సేవలతో సంస్థ అభివృద్ధికి తోడ్పడిన ఆరుగురు ఉద్యోగులు అక్టోబర్ 31న పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ రఫిక్ అహ్మద్ ఆధ్వర్యంలో పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు.పదవీ విరమణ చేసిన వారిలో వై. మల్లయ్య, కే.ఎన్. ప్రసాద్ రావు, వి.వి. రమేష్, చంద్ర మహారాజ్, కే. శ్రీనివాస్ రావు, వై. అజయ్ కుమార్ ఉన్నారు. నాలుగు దశాబ్దాల పాటు విధుల పట్ల అంకితభావంతో పనిచేసిన వీరి సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.సంస్థలో సుదీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అభినందనలు తెలియజేస్తూ, వారి భవిష్యత్తు జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. ఉద్యోగ జీవితంలో వారు అందించిన సేవలు సంస్థకు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏ రాజారావు వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ జగన్నాథ్ డిజిఎం సిహెచ్ మురళీధర్ జనరల్ సెక్రెటరీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్తగూడెం పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి జన్మదిన వేడుకలు

భద్రాద్రి కొత్తగూడెం, 31 అక్టోబర్ ,ప్రజా జ్యోతి:కొత్తగూడెం పట్టణ 3 టౌన్ పరిధిలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి గారిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్ మరియు TG TTF రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్ ,ఈ సందర్భంగా కేకు కట్ చేసి సాల్వాతో సత్కరించారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సిరి సంపదలతో వర్ధిల్లాలని ఆ దేవుని ఆశీర్వాదం ఎప్పుడు ఉండాలని ఆకాంక్షించారు . జన్మదిన వేడుకలు నేపథ్యంలో భాగంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ఆ శాంతి హింసలకు తావు లేకుండా శాంతి భద్రతలను క్రమశిక్షణతో నిర్వహిస్తానని నిస్వార్థమైన సేవను అందిస్తానని తెలియజేయడం జరిగింది.

త్యాగాల పునాదులపై నిర్మితమైన ఏఐటీయూసీ శ్రామిక లోకానికి కొండంత అండ

(మొదటి పేజీ తరువాయి...)

వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులతో భారీ ప్రదర్శన చేపట్టి పట్టణంలోని సుమారు 25 ప్రధాన కార్మిక అడ్డాలు, కూడళ్లలో ఎర్రజెండాలను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్మిక సదస్సుకు కూనంనేని ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.బ్రిటిష్ వలస పాలన కాలం నుంచి స్వాతంత్ర్య ఉద్యమం వరకు దేశ ప్రగతిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, అలాంటి కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వాల్సిన పాలకులు నేడు పెట్టుబడిదారీ వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయమని మండిపడ్డారు. ఈ విధానాలు కార్మికుల ప్రయో

జనాల కంటే యజమానుల లాభాలకే పెద్దపీట వేస్తున్నాయని విమర్శించారు.దేశ సంపదగా ఉన్న నవరత్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు విక్రయించే ప్రయత్నాలను కార్మికులు ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, పెన్షన్ సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను సవరించాలని, కార్మిక సంక్షేమ బోర్డులను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులు ఎవరో దానంగా ఇచ్చేవి కావని, ఐక్య పోరాటాల ద్వారానే వాటిని సాధించుకోవాలని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా సాగుతున్న విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని, కార్మిక వ్యతిరేక నిర్ణయాలపై దేశవ్యాప్త సమ్మెలకు కార్మిక లోకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. శ్రామిక ఐక్యతతోనే పాలకుల మెడలు వంచి హక్కులను కాపాడుకోగలమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్ రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, ఏఎంసీ డైరెక్టర్ వాడే లక్ష్మి , సీపీఐ జిల్లా సమితి సభ్యులు వీ. పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, ప్రజాసంఘాల నాయకులు శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి సునీల్ కుమార్, వైఎస్ గిరి, వేములపల్లి శ్రీను, గౌతమి కృష్ణ, పల్లపు యాకయ్య, కోరే కృష్ణ, పున్నారావు, గోపి, అద్దంకి బాబు, రాము, వెంకట్, బాబు, శెట్టి చేరాలు, జకరయ్య, కొంగర అప్పారావు, ఆలపాటి ప్రసాద్, నామ పండు, నవీన్, కాకటి రవీందర్, ఆదినారాయణ, రవి, కిరణ్, నాగేశ్వరరావు, వెంకన్న, ప్రభావతి, పుష్ప, ముతమ్మ, నాగమణి, ప్రేమచంద్, ప్రశాంత్, రమేష్, కాటూరి రాము, కొమరయ్య, అల్లి వెంకటేశ్వర్లు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

సమీక్ష నిర్వహించారు. ఐడీఓసీ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, పుష్కరాల కోసం చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసి పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న ఘాట్ల మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనుల పురోగతిని జిల్లాల వారీగా సమీక్షించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు.పుష్కరాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితమైన తాగునీటి సరఫరాకు పక్కా ప్రణాళిక రూపొందించాలని, పుష్కర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భక్తులను ఆకట్టుకునేలా ఆకర్షణీయమైన లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, ఘాట్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా పుష్కరాల అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాల ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈఓ దామోదర్ రావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ గిరిజన యువతి యువకులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించు కోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

అందిస్తున్న వై టి సి ని సందర్శించి, ఇప్పటివరకు శిక్షణ పొందిన శిక్షణార్థుల సంఖ్య, ప్రస్తుతం శిక్షణ పొందుతున్న శిక్షణార్థులు అలాగే రాబోయే బ్యాచులకు సంబంధించిన వివరాలను సమీక్షించిన అనంతరం వివిధ కోర్సులలో శిక్షణ తీసుకుంటున్న గిరిజన యువతలను నేర్చుకున్న శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గిరిజన యువతులకు పలు సూచనలు ఇస్తూ బ్యూటీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్, గెస్ట్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ శిక్షణ తీసుకుంటున్న మహిళలతో చాలా శ్రద్ధతో శిక్షణ తీసుకోవాలని అన్నారు. తీసు

కున్న శిక్షణను వృధా చేయకుండా తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.శిక్షణ తీసుకుంటున్న యువతులు శిక్షకులు అందిస్తున్న బ్యూటీషియన్, ఎంబ్రాయిడరింగ్, టైలరింగ్, గేస్ట్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ శిక్షణ తీసుకున్న యువతులు సొంతంగా వ్యాపారాలు పెట్టుకొని ఆర్థికంగా వెసులుబాటు కల్పించుకొని జీవనోపాధి కల్పించుకోవాలని అన్నారు.శిక్షణ అందిస్తున్న ఫ్యాకల్టీలు యువతులు ఏ వృత్తిలో అయితే శిక్షణ తీసుకుంటున్నారో ఆ శిక్షణతో పాటు బాహ్య ప్రపంచంలో కొత్త టెక్నిక్ సంబంధించిన విషయాలు వారికి తెలియజేయాలని, బ్యూటీషియన్ శిక్షణలో కొత్త సాంకేతికలు ఆధునిక పద్ధతులను చేర్చాలని అన్నారు.ప్రస్తుతం వివిధ కోర్సులలో శిక్షణ తీసుకుంటున్న యువతులు తోటి వారికి కూడా తెలియజేసి వారు కూడా వృత్తి నైపుణ్యాల శిక్షణ తీసుకొని జీవనోపాధి కల్పించుకునేలా చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీలు రోజా, క్రాంతి రేఖ, స్వరూప, సౌజన్య, యువతులు తదితరులు పాల్గొన్నారు.

బీకాం కంప్యూటర్స్‌లో రింకు ప్రజాపత్‌కు బంగారు పతకం

- కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అత్యధిక మార్కులతో ఘనత

ఇల్లందు, అక్టోబర్, 31 (ప్రజా జ్యోతి) కాకతీయ యూనివర్సిటీ 24వ స్నాతకోత్సవంలో భాగంగా ప్రకటించిన ఫలితాల్లో ఇల్లందు పట్టణంలోని సాహితీ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని రింకు ప్రజాపత్ బీకాం కంప్యూటర్స్ విభాగంలో యూనివర్సిటీ పరిధిలో అత్యధిక మార్కులు సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్లు కళాశాల డైరెక్టర్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక సాహితీ డిగ్రీ కళాశాలలో రింకు ప్రజాపత్ ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థిని రింకు ప్రజాపత్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో నవంబర్ 28వ తేదీన నిర్వహించనున్న స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా రింకు ప్రజాపత్ బంగారు పతకాన్ని అందుకోవడం జరుగుతుందన్నారు. ఈ విజయానికి సహకరించిన విద్యార్థిని తల్లిదండ్రులు, కళాశాల ప్రిన్సిపాల్ తుపాకుల వేణు, అధ్యాపక, బోధనేతర సిబ్బందికి కళాశాల యాజమాన్యం తరపున అభినందనలు తెలిపారు.

గిరిజన గ్రామాల్లో పోలీసుల కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం

- 100 మంది చిన్నారులకు దుస్తులు పంపిణీ

భద్రాచలం, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో చర్ల మండలంలోని చెన్నాపురం, ఎర్రంపాడు గిరిజన గ్రామాల్లో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రెండు గ్రామాలకు చెందిన 100 మంది చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న డీఎస్పీ, గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.చిన్నారుల విద్య, ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని సూచించారు.గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజు వర్మ,ఎస్సై నర్సిరెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

► ఐటీడీఏ పీవో బి. రాహుల్ ప్రకటన

భద్రాచలం, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కు చెందిన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు భద్రాచలం యువజన శిక్షణ కేంద్రంలో 3 నుంచి 4 నెలల పాటు ఉచిత నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు.సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ టైలర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, సీఎంఆర్ డొమెస్టిక్ నాన్ వాయిస్, గెస్ట్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ టెక్నీషియన్, డ్రోన్ సర్వీసెస్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. అర్హతను బట్టి 18 నుంచి 35 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, దుస్తులు, పుస్తకాలు అందించడంతో పాటు శిక్షణ అనంతరం ధ్రువపత్రం ఇస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్, కుల, ఆదాయ, విద్యార్హత పత్రాలతో నవంబర్ 4లోగా భద్రాచలం యువజన శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9347466615, 9441390232 నంబర్లను సంప్రదించాలన్నారు.

›› గెస్ట్ అధ్యాపకులు, విద్యార్థి సలహాదారు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

2026–27 విద్యా సంవత్సరానికి ఏకలవ్య మోడల్ పాఠశాలలు, గురుకులాల్లో ఒక గెస్ట్ డిగ్రీ లెక్చరర్, ఒక స్టూడెంట్ కౌన్సిలర్ పోస్టు భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మణుగూరు గురుకులంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ గెస్ట్ డిగ్రీ లెక్చరర్ పోస్టుకు నెలకు రూ.32,500, టేకులపల్లి ఏకలవ్య పాఠశాలలో స్టూడెంట్ కౌన్సిలర్ పోస్టుకు రూ.35,400గౌరవ వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

► కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. జాన్ మిల్టన్

భద్రాచలం, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో 2026–27 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. జాన్ మిల్టన్ తెలిపారు.ఎం.ఎస్సీ కెమిస్ట్రీ, ఫిజి క్స్, ఎం.ఏ తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, ఎం.కాం కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం ఉందని, టీజీ సీపీగెట్–2026 నిబంధనల ప్రకారం అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అడ్మిషన్లకు నవంబర్ 7 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపా రు.విద్యార్థులు ర్యాంకు కార్డుతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ధ్రువపత్రాలు, మార్కుల మెమోలు, స్టడీ, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు, కుల, నివాస ధ్రువపత్రాలు తదితర అవసరమైన పత్రాల ఒరిజినల్స్ సమర్పించాలని సూచించారు. పీజీ విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఆంగ్ల భాషా నైపుణ్యాలకు ఒలంపియాడ్ వేదిక

♦ ఎల్టా కన్వీనర్ పి.ఎస్.పి. ప్రసాద్ బాబు

భద్రాచలం, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై ఆసక్తిని పెంపొందించి, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్ దోహదపడుతుందని భద్రాచలం ఎల్టా కన్వీనర్ పి.ఎస్.పి. ప్రసాద్ బాబు అన్నారు.భద్రాచలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం భద్రాచలం ఎల్టా ఆధ్వర్యంలో తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీల్లో ఒక్కో విభాగం నుంచి 31 మంది చొప్పున మొత్తం 62 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ, ఇలాంటి పోటీ పరీక్షలు విద్యార్థుల్లో భాషా పరిజ్ఞానం, వ్యాకరణ నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషపై పట్టు సాధించడం ఎంతో అవసరమని, చిన్ననాటి నుంచే ఇలాంటి పరీక్షల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం, విశ్లేషణాత్మక ఆలోచనా సామర్థ్యం పెరుగుతాయని పేర్కొన్నారు.పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా ఆంగ్ల భాషను ఆచరణలో ఉపయోగించే నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడమే ఈ కార్యక్రమాల లక్ష్యమన్నారు.కార్యక్రమంలో ఎల్టా కో–కన్వీనర్ ఫణి శ్రీ, సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయులు జి. రామచంద్రరావు సమన్వయంతో వ్యవహరించగా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్సన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల ఆసక్తిని ఉపాధ్యాయులు అభినందించారు.

టీఎస్ యూటీఎఫ్ భద్రాచలం మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పి.ఎస్.వి. ప్రసాద్‌బాబు

భద్రాచలం, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): టీఎస్ యూటీఎఫ్ భద్రాచలం మండల 13వ మహాసభలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పి.ఎస్.వి. ప్రసాద్ బాబు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.ఎం. కరుణకుమార్, కె. పుష్పలత, కోశాధికారిగా ఎస్. ఆశాలత ఎన్నికయ్యారు.ఈ మహాసభకు జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్, జిల్లా ఆడిట్ కన్వీనర్ ఎం. సత్యనారాయణ హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి ఎస్. విజయ్‌కుమార్ వ్యవహరించారు.ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేదిక ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 14న భద్రాచలంలో జరిగే జిల్లా మహాసభలను, డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

దేశ సమగ్రతకు పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయం

- టీఎన్జీవోస్ కార్యదర్శి గగ్గూరి బాలకృష్ణ

భద్రాచలం, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): దేశ సమగ్రతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని టీఎన్జీవోస్ కార్యదర్శి గగ్గూరి బాలకృష్ణ అన్నారు. శనివారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన పటేల్ అఖండ భారతదేశ నిర్మాణంలో అపారమైన కృషి చేసిన మహనీయుడని కొనియాడారు.1875 అక్టోబర్ 31న గుజరాత్ లో జన్మించిన పటేల్ న్యాయవాద వృత్తిని విడిచిపెట్టి గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా బర్డోలీ సత్యాగ్రహాన్ని విజయవంతంగా నడిపి ప్రజల నుంచి 'సర్దార్' బిరుదును పొందారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ తొలి ఉప ప్రధానిగా, హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టి 560కి పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి జాతీయ సమైక్యతకు పునాది వేశారని పేర్కొన్నారు. దేశ సమగ్రతను కాపాడిన ఆయనను భారత ఉక్కు మనిషిగా ప్రజలు గౌరవిస్తారని తెలిపారు. అఖిల భారత సర్వీసుల వ్యవస్థ రూపకల్పనలోనూ ఆయన కీలక పాత్ర పోషించారని వివరించారు. పటేల్ జన్మదినాన్ని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకోవడం ఆయన దేశానికి చేసిన సేవలకు నిదర్శనమన్నారు. ఆయన స్మారకంగా గుజరాత్ లో నిర్మించిన ఐక్యతా విగ్రహం ఆయన కీర్తికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ జిల్లా అధ్యక్షుడు శ్యామల శ్రీనివాస్, కోశాధికారి పడిగ నరసింహారావు, అంజిబాబు, పాపారావు, మస్తాన్, సాధిక్ భాష, వెంకటేష్, అన్వర్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం

▶ ఘనంగా 42వ వర్ధంతి నివాళులు

భద్రాచలం, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ 42వ వర్ధంతి సందర్భంగా భద్రాచలం బ్రిడ్జి సెంటర్ లోని ఆమె విగ్రహానికి శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ సమగ్రత, సమైక్యత కోసం ఆమె చేసిన కృషి భారత చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు. ఆమె ఆశయాలను, ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఇందిరా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

షాట్‌పుట్‌లో ప్రథమ స్థానంతో సత్తాచాటిన యానంబైలు విద్యార్థి

పాల్వంచ, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి: జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో పాల్వంచ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ యానంబైలు పాఠశాల విద్యార్థి బి. చరణ్ ప్రతిభ చాటాడు. షాట్ పుట్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి పాఠశాలకు, గ్రామానికి గుర్తింపు తీసుకువచ్చాడు. విద్యార్థి సాధించిన విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ప్రకాష్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ డి. సాగర్ ఫణి, పీడీ ఏ. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ చరణ్‌ను అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామ సర్పంచ్ సుప్రియ సైతం చరణ్‌ను అభినందిస్తూ పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచాడని కొనియాడారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల ఉపాధ్యాయుల కృషిని గ్రామస్తులు ప్రశంసించారు.

మేట్లకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం

▶ ప్రభుత్వ పథకాల అమలులో మేట్ల పాత్ర కీలకం: అడిషనల్ పీడీ రవి

పాల్వంచ, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి: ప్రభుత్వ ఆదేశాల మేరకు పాల్వంచ మండలంలోని పాండురంగాపురం క్లస్టర్ పరిధిలోని గ్రామపంచాయతీల మేట్లకు శనివారం ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ పీడీ రవి మాట్లాడుతూ వి బి – జి, ఆర్ ఏ ఎం – జి పథకం కింద గ్రామపంచాయతీల్లో చేపట్టే పనులను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించడంలో మేట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కూలీలకు పనులపై పూర్తి అవగాహన కల్పించి, పనులకు హాజరయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ పని కల్పించే దిశగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. కూలీల హాజరు పట్టికను ప్రతిరోజూ తప్పనిసరిగా సక్రమంగా నమోదు చేయాలని, అర్హులైన కూలీలకు రోజువారీ వేతనం రూ.308 అందేలా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కోడిపుంజులవాగు, కొత్త సూరారం, పాండురంగాపురం, పాండురంగాపురం తండా, పాయకారి యానంబైలు, ప్రభాత్ నగర్, పునుకుల, సూరారం, తవిశలగూడెం, ఇల్లందుపాడు తండా గ్రామపంచాయతీలకు చెందిన మేట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రమణ, ట్రైనింగ్ కోఆర్డినేటర్, ఈసీ కె. పుల్లయ్య, ఏపీఓ రఘుపతి, పాండురంగాపురం పంచాయతీ కార్యదర్శి షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి

చర్ల, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): చర్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చీమల మర్రి మురళి మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైక్యత, అభివృద్ధి కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశ ప్రధానిగా ఆమె తీసుకున్న పలు కీలక నిర్ణయాలు భారతదేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. దేశ ఐక్యత, ప్రజల సంక్షేమం కోసం ఆమె చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకురాలు ఇందిరా గాంధీ అని కొనియాడారు. ఆమె చూపిన మార్గంలో పయనిస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇందిరా గాంధీ ఆశయాల సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షుడు విజయ్ నాయుడు మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలు, ఆమె చూపిన నాయకత్వ పటిమ ఎప్పటికీ మరువలేనివని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మడకం పద్మ, కాంగ్రెస్ నాయకులు గుండేపూడి భాస్కర్ రావు, పుగాకు సతీబాబు, నూపా కృష్ణ, సీనిగిరి సుధాకర్, ముప్పిడి రమేష్, మేడి రమేష్, కారం సుధాకర్, ఎనూటి గిరిబాబు, భాస్కర్, స్వరూప్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ సెల్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు

పాల్వంచ, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి: భారత మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పాల్వంచ దమ్మపేట సెంటర్‌లోని ఇందిరమ్మ విగ్రహం వద్ద మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అంజలి ఘటించారు. దేశ సమగ్రత, సమైక్యతను కాపాడేందుకు ఆమె చేసిన కృషిని, దేశ అభివృద్ధికి అందించిన సేవలను స్మరించుకున్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె తీసుకున్న నిర్ణయాలు చిరస్మరణీయమని కొనియాడారు. పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాకల రంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గంగిరెడ్డి భువన సుందర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎస్.ఏ. జలీల్, ప్రధాన కార్యదర్శి బాలు నాయక్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, కార్పొరేటర్లు కాల్వ భాస్కర రావు, దంతెబోయిన నరేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జాలే జానకిరెడ్డి, మహిపతి రామలింగం, యర్రంశెట్టి ముత్తయ్య, రాము నాయక్, పెంకి శ్రీను, మాలంపాటి కిరణ్, సుందర్ రావు, దున్నపోతుల రవి, మురారి రాములు, మైనారిటీ కాంగ్రెస్ నాయకులు షేక్ దస్తగిరి, గద్దర్ బాషా, సీనియర్ నాయకులు కొక్కుల వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పైడిపల్లి మహేష్, సాయి, కటుకూరి శేఖర్, మురారి పద్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్వంచ క్రీడాకారిణికి స్వర్ణం

• జాతీయ పాఠశాల క్రీడలకు ఎంపికైన సుతీర్థ యాదవ్

పాల్వంచ, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి: 70వ ఎస్‌జీఎఫ్ఐ తెలంగాణ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్వంచకు చెందిన యామర్తి సుతీర్థ యాదవ్ స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్–19 బాలికల 68 కిలోల పైబడిన విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. అక్టోబర్ 29 నుంచి 31 వరకు హైదరాబాద్‌లోని ఉప్పల్ లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ విజయంతో జార్ఖండ్‌లో జరగనున్న 70వ జాతీయ పాఠశాల క్రీడల్లో పాల్గొనేందుకు సుతీర్థ అర్హత సాధించింది. పాల్వంచలోని కేటీపీఎస్ సీ కాలనీకి చెందిన ఆమె రాష్ట్రస్థాయిలో స్వర్ణ పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల స్థానిక క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న సుతీర్థ ఇప్పటికే మూడు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. తాజా విజయంతో నాలుగోసారి జాతీయస్థాయిలో తన ప్రతిభను చాటేందుకు సిద్ధమవుతోంది. ఎస్ఎంఏ తైక్వాండో అకాడమీ ప్రధాన కోచ్ గణేష్ యాదవ్ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతున్న ఆమె నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో ఈ విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా కోచ్ గణేష్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత అవకాశాలకు మార్గం చూపుతాయని అన్నారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కాగా, సుతీర్థ తల్లిదండ్రులు యామర్తి రవికుమార్ (ఏడీఈ/కేటీపీఎస్–7), కల్పన తమ కుమార్తె సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి పోటీల్లోనూ పతకం సాధించి పాల్వంచతో పాటు తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సుతీర్థ విజయంపై పలువురు క్రీడాకారులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు.

బాధిత కుటుంబాలకు కొత్వాల దంపతుల పరామర్శ

పాల్వంచ, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి: పాల్వంచ పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన దశదినకర్మలు, ప్రథమ వర్ధంతి కార్యక్రమాల్లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు పాల్గొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పాల్వంచకు చెందిన ముత్యాల సతీశ్ ఇటీవల మృతి చెందగా, శనివారం నిర్వహించిన ఆయన దశదినకర్మలో కొత్వాల దంపతులు పాల్గొని నివాళులర్పించారు. అదేవిధంగా రైతు నాయకులు, అయ్యప్పనగర్ నివాసులు ధూలిపాళ కుమారస్వామి, గోపాలకృష్ణల మాతృమూర్తి ఇటీవల మృతి చెందగా, ఆమె దశదినకర్మలో పాల్గొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం పాల్వంచ 45వ డివిజన్ గోవర్ధనగిరి కాలనీలో చేకూరి వెంకట్రావు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల దంపతులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో వాసుమల్ల సుందర్ రావు, బూసి శ్రీను, కొదురి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

- 170 మందికి కంటి పరీక్షలు
- 15 మందికి ఉచితంగా ఆపరేషన్లు

పాల్వంచ, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి: లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల తండా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు లయన్ చేపూరి బ్రహ్మాచారి జన్మదినాన్ని పురస్కరించుకుని లయన్స్ ఐ హాస్పిటల్, వైరా వారి సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన లయన్ డాక్టర్ బి. సుధాకర్ రావు (శ్రీ సాయి సుధా హాస్పిటల్, పాల్వంచ) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, అందులో భాగంగానే కిన్నెరసాని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరానికి సహకరించిన లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, లయన్ జీఎంటీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, సీనియర్ నేత్ర వైద్య నిపుణులు లయన్ ఉంద్రు శ్యాంబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ చేపూరి బ్రహ్మాచారి, లయన్ మాడిశెట్టి రాజ మనోహర్‌ల సేవలను అభినందించారు. రేగళ్ల తండా గ్రామపంచాయతీ సర్పంచ్ బి. పూర్ణచంద్ మాట్లాడుతూ తమ గ్రామపంచాయతీలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినందుకు లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ శిబిరంలో 90 మంది పాఠశాల విద్యార్థులు, 80 మంది గ్రామస్తులు కలిపి మొత్తం 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 15 మందికి లయన్స్ ఐ హాస్పిటల్‌లో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయనున్నట్లు కంటి వైద్యుడు రవిచంద్ర తెలిపారు. అవసరమైన ఇతరులకు కళ్లద్దాలు, కంటి చుక్కల మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జోన్-3 చైర్‌పర్సన్ లయన్ కేదారేశ్వర రావు, లయన్స్ క్లబ్ పాల్వంచ కిన్నెరసాని ట్రెజరర్ లయన్ మాడిశెట్టి రాజ మనోహర్, క్లబ్ జీఎస్టీ కోఆర్డినేటర్ ఎం.డి. రంజాన్, లయన్స్ క్లబ్ పాల్వంచ పవర్ అధ్యక్షుడు చావా రమణ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, గుగులోత్ హరి, ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ గుగులోత్ రవి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహాయం కోసం కిడ్నీ బాధితుడి వేడుకోలు

పినపాక,అక్టోబర్ 31(ప్రజాజ్యోతి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం పినపాక గ్రామానికి చెందిన గుడిమెట్ల వెంకన్న గౌడ్ గత కొంతకాలంగా తీవ్రమైన మూత్రపిండాల (కిడ్నీ) సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన హనుమకొండలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు.నిరుపేద కుటుంబానికి చెందిన వెంకన్న, వైద్య ఖర్చుల నిమిత్తం తన వద్ద ఉన్న డబ్బులన్నీ ఇప్పటికే ఖర్చు చేశారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో, చికిత్స పూర్తి కాకుండానే దిక్కుతోచని స్థితిలో తిరిగి ఇంటికి చేరుకున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంకన్న ప్రాణాలను కాపాడుకోవడానికి, వైద్యం నిరంతరాయంగా కొనసాగడానికి మరో రూ. 1 లక్ష వరకు అత్యవసరంగా అవసరమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.తమకు అంత ఆర్థిక స్తోమత లేదని, దాతలు మానవతా దృక్పథంతో స్పందించి తగిన సహాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వెంకన్న దంపతులు కన్నీటితో ప్రాధేయపడుతున్నారు. ఆర్థికంగా సహాయం చేయాలనుకునే దాతలు లేదా వివరాలు తెలుసుకోవాలనుకునే వారు 9160868305 మొబైల్ నంబరుకు సంప్రదించాల్సిందిగా కోరారు.

సైక్లింగ్‌లో బండారి నాగేశ్వర్‌రావుకు అరుదైన ఘనత

- సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి క్లాస్-1 కోచ్ సర్టిఫికేషన్.
- జిల్లా యువజన, క్రీడల అధికారి బి. అనూష అభినందనలు

పాల్వంచ, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి: సైక్లింగ్ రంగంలో జిల్లాకు చెందిన సీనియర్ సైక్లిస్ట్, ఎన్ఐఎస్ ధ్రువీకృత సైక్లింగ్ కోచ్ బండారి నాగేశ్వర్‌రావు మరో అరుదైన ఘనత సాధించారు. సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ) నుంచి ప్రతిష్ఠాత్మకమైన క్లాస్-1 కోచ్ సర్టిఫికేషన్ పొందారు. ఈ గుర్తింపు ఆ యన సైక్లింగ్ రంగంలో అందిస్తున్న సేవలు, శిక్షణా నైపుణ్యానికి నిదర్శనం గా నిలుస్తోంది.ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి (ఎఫ్ఏసీ) బి. అనూష ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘనత సాధించేందు కు నాగేశ్వర్‌రావు చూపిన అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధత, నిరంతర కృషి ని ప్రశంసించారు. ఆయన సాధించిన విజయం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.

›› జిల్లాలో సైక్లింగ్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

జిల్లాలో సైక్లింగ్ క్రీడను క్షేత్రస్థాయిలో మరింత అభివృద్ధి చేయడంతో పాటు యువతకు మెరుగైన శిక్షణ అవకాశాలు కల్పించేందుకు బండారి నాగేశ్వర్ రావు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో స్వతంత్ర సైక్లింగ్ క్లబ్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.ఈ క్లబ్ ద్వారా సైక్లింగ్ శిక్షణ సదుపాయాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను గుర్తించి వారికి నాణ్యమైన శిక్షణ అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా యువ సైక్లిస్టులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా ప్రోత్సహించేందుకు కృషి చేయనున్నారు. సైక్లింగ్‌పై ఆసక్తి కలిగిన యువత, క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం 9884890788 నంబర్‌కు సందేశం పంపవచ్చని నిర్వాహకులు తెలిపారు.

అన్నపురెడ్డిపల్లిలో రహదారి అభివృద్ధి పనులకు ఊపందుకున్న వేగం

- రూ.5.80 కోట్లతో ఒక కిలోమీటరు మేర బీటీ రోడ్డు నిర్మాణం
- సెంట్రల్ లైటింగ్ పనులు సైతం వేగవంతం
- పనులు తిరిగి మొదలవడంతో హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 31, (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు మళ్లీ ఊపందుకుంది. గతంలో ప్రారంభమై మధ్యలో నిలిచిపోయిన రహదారి పనులను తిరిగి చేపట్టడంతో స్థానిక ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5.80 కోట్ల నిధులతో సెంట్రల్ లైటింగ్, బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సుమారు ఒక కిలోమీటరు పొడవున చేపడుతున్న ఈ రహదారి నిర్మాణంలో 7.50 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు వేస్తున్నారు. రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. రోడ్లు, భవనాల శాఖ డివిజనల్ ఇంజినీర్ విశ్వనాథ్ పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

గ్రామ ప్రజల్లో హర్షం... ప్రధాన రహదారి పనులు తిరిగి మొదలవడంతో మండల కేంద్రంలోని గ్రామ ప్రజలు, వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా రహదారి పనులు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. ముఖ్యంగా దుమ్ము, ధూళితో దుకాణదారులు, స్థానిక నివాసితులు అనేక అవస్థలు పడ్డారని పేర్కొన్నారు. ప్రస్తుతం పనులు మళ్లీ వేగం పుంజుకోవడంతో తమ ఇబ్బందులు తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే ప్రయాణం సౌకర్యవంతంగా మారడంతో పాటు మండల కేంద్రం రూపురేఖలు మారనున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు వల్ల రాత్రి వేళల్లో రహదారి మరింత అందంగా కనిపించడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యం కలుగుతుందని తెలిపారు. నిలిచిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ముగిసిన జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 31(ప్రజా జ్యోతి) భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ లో జరిగిన జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ శనివారం ఘనంగా ముగిసింది , ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పంచాయతీ అధికారి బి అనూష, కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజ్, ఎన్.ఎస్.ఎస్ జిల్లా కోఆర్డినేటర్ కామేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మేరా యువ భారత్ అధికారి ఎం.వెంకట్ రాంబాబు లో పాల్గొన్నారు ,ఈ కార్యక్రమంలో ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు, అనంతరం వారు మాట్లాడుతూ యువతలో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, దేశాభివృద్ధి పట్ల అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లాస్థాయి విక్షిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో యువత తమ ఆలోచనలు, అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తపరిచేందుకు ఈ కార్యక్రమం ఒక మంచి వేదికగా నిలుస్తుందని అనూష అన్నారు, యువతలో పార్లమెంటరీ వ్యవస్థ, రాజ్యాంగ విలువలు, పౌర బాధ్యతలు, దేశ నిర్మాణంలో యువత పాత్రపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు ,ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని డిస్టిక్ యూత్ అధికారి రాంబాబు అన్నారు. అదేవిధంగా ఈ "వన్ నేషన్ - వన్ ఎలక్షన్" అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు . 58 విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో బి. నవదీప్ రెడ్డి, జి. మేఘన, జి. పావని జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

- కొత్తగూడెం మార్కెట్ పరిధిలో అక్రమ వసూళ్ల ఆరోపణల గుట్టుమట్లు!
- ఆన్‌లైన్ పద్ధతంటూ కొత్త పాట.. ఫిజికల్ కాపీలు పంపడానికే డబ్బులు అడిగారా?
- ఒక్క సుజాతనగర్‌లోనే 45 మంది కొనుగో లుదారులుంటే 13 మందే లైసెన్స్‌దారా?
- రైడ్ చేస్తే అక్టోబరు 27నే 'ప్రెస్‌నోట్' ఎందుకు ఇవ్వలేదు?

ఎన్ని 'కథలు'.. అల్లుతారు..?

● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల జారీ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతూ తీవ్ర దుమారం రేపుతోంది. అదనపు 'అమామ్యాల వసూళ్ల' వ్యవహారంపై నిజాలు నిలదీస్తుంటే కొందరు అధికారులు తప్పించుకునేందుకు, విషయాన్ని గంద రగోళం చేసేందుకు 'ఎన్ని కథలు అల్లుతారు?' అని వ్యాపార వర్గాల నుంచి ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవల సుజాతనగర్ ప్రైవేట్ యార్డులో కొందరిని పట్టుకున్నామని, ఆ నేపథ్యంలోనే ఈ వార్తలు వస్తున్నాయని చెబుతూ అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. మరోవైపు ట్రేడ్ లైసెన్స్‌ల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని, తమకు రూపాయి కూడా సంబంధం లేదని అధికారులు కొత్త పాట పాడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ట్రేడ్ లైసెన్స్ పొందేందుకు రూ. లక్ష బ్యాంకు గ్యారంటీ, రూ. 5 వేల డీడీలతో పాటు దరఖాస్తు ఫిజికల్ కాపీలను స్థానిక ఆఫీసులోనే పూర్తి చేసి ఇవ్వాల్సి ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. అలా ఇక్కడి అధికారులకు సమర్పించిన కాగితాలను హైదరాబాద్ పంపించడానికే అధికారుల తరఫున 'అమామ్యాలు' అడిగారనేది ప్రధాన ఆరోపణగా కనిపిస్తోంది. మరి ఫిజికల్ కాపీలను హైదరాబాద్‌కు పంపించే ప్రక్రియ ఉండగా, 'మాకేం సంబంధం లేదు' అని అధికారులు ఎలా చెప్తారనే సందేహాలు నిబంధనలు తెలిసిన వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

›› డీల్ కుదిర్చిన ప్రైవేటు యార్డు నిర్వాహకుడు?

ఈ విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నంలో ఎవరికి తోచిన కథలు వారు చెబుతూ విషయాన్ని తారుమారు చేస్తున్నారనే ప్రచారం నడుస్తోంది. అసలు సిసలైన ప్రశ్న ఒకటే.. ట్రేడ్ లైసెన్స్ కోసం అవసరమైన అన్ని కాగితాలు సిద్ధం చేసుకున్న వ్యాపారుల నుంచి ఆ పత్రాలు స్వీకరించడానికి డబ్బులు అడిగారా? లేదా? అనేది ఉన్నతాధికారుల విచారణలోనే తేలాల్సి ఉంది. సుజాతనగర్ కేంద్రంగా ప్రైవేటు యార్డులు నిర్వహిస్తున్న ఒక ప్రైవేటు నిర్వాహకుడు వ్యాపారులకు, అధికారులకు మధ్యవర్తిగా వ్యవహరిస్తూ ఒక్కో లైసెన్స్‌కు కిందిస్థాయి రూ. 16 వేల చొప్పున డీల్ కుదిర్చాడనే ప్రచారంపై నిజానిజాలు బయటకు రావాల్సి ఉంది. మరోవైపు, జిల్లాలోని ఒక ఉన్నతాధికారికి విలేకరి ఫోన్ చేసినప్పుడు అనూహ్యంగా సెక్యూరిటీ గార్డ్ రంగంలోకి దిగి, "డీఎంవో గారు కొత్తగూడెం సెక్రటరీ గారికి నీ నంబర్ ఇచ్చారు.. ఆయన నాకు ఇచ్చారు.. సార్ నా పక్కనే ఉన్నారు మాట్లాడండి" అంటూ మాట్లాడటం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే ప్రశ్నలు సంచలనం రేపుతున్నాయి. ఈ విచిత్ర వైఖరి చూస్తుంటే ఈ వ్యవహారంలో కొందరి ప్రమేయం ఉందనే అనుమానాలు మరింత బలోపేతమవుతున్నాయి.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
28 Oct 2026 - Page 1

- కొత్తగూడెం మార్కెట్ కమిటీ పరిధిలో అదనపు వసూళ్ల ఆరోపణలు
- ఒక్కో దరఖాస్తుకు రూ.20 వేల డిమాండ్.. చివరకు రూ.16–17 వేల వద్ద బేరసారాలు?
- బ్యాంకు గ్యారంటీ, డీడీలు ఉండగానే అదనపు బాదుడు..
- సమగ్ర విచారణకు వ్యాపారుల డిమాండ్..

ట్రేడ్ లైసెన్స్‌లకు... 3 లో.. అమామ్యాలు చెల్లించాల్సిందే..!?

● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల జారీ వ్యవహారం ప్రస్తుతం తీవ్ర వివాదాస్పదంగా మారింది. నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన అధికారిక రుసుములకు అదనంగా పెద్ద మొత్తంలో 'అమామ్యాలు' చెల్లించాల్సిందేననే ఆరోపణలు వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునే వ్యాపారుల నుంచి ఒక్కో దరఖాస్తుకు మొదట రూ.20 వేలు డిమాండ్ చేసి, చివరకు రూ.16 వేల నుంచి రూ.17 వేల వరకు బేరసారాలు ఆడి వసూలు చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

›› 45 మంది కొనుగోలుదారులు ఉంటే 13 మందే లైసెన్స్‌దారా?

జిల్లావ్యాప్తంగా అసలు ఎంతమంది ట్రేడ్ లైసెన్స్‌లు పొంది వ్యాపారాలు చేస్తున్నారు? ఎవరెవరి ప్రాపకంలో అక్రమ వ్యాపారాలు సాగుతున్నాయో నిష్పాక్షిక విచారణ ద్వారా తేలాల్సి ఉంది. ఒక్క సుజాతనగర్‌లోని రెండు ప్రైవేట్ యార్డుల పరిధిలోనే సుమారు 40 నుంచి 45 మంది కొనుగోలుదారులు వ్యాపారాలు చేస్తుండగా, అక్కడ కేవలం 13 మంది మాత్రమే అధికారిక లైసెన్స్ పొందిన వ్యాపారులు ఉన్నారనే కథనాలు వినిపిస్తున్నాయి. మరి మిగిలిన వారందరూ లైసెన్స్‌లు లేకుండా ఎవరి అనుమతులతో వ్యాపారాలు చేస్తున్నారు? ఇన్నాళ్లూ సంబంధిత యంత్రాంగం ఏం చేస్తోంది? ఇప్పుడు విచారణ పేరుతో కొందరిని అనుమానిస్తూ వారిని ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు ఎందుకు చేస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవేళ అక్టోబరు 27వ తేదీ నాడే అధికారులు సుజాతనగర్‌లో రైడ్ చేసి ఉంటే.. ఆ రోజే అధికారికంగా 'ప్రెస్‌నోట్' ఎందుకు విడుదల చేయలేదు, దాన్ని ఇప్పుడు ఎందుకు బూచిగా చూపిస్తున్నారు అనే విషయమై స్పష్టత రావాల్సి ఉంది.

'ఎయంసి చైర్మన్ లాల్ సింగ్' తీవ్ర ఆగ్రహం..

కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల పేరుతో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ప్రచారంపై జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటి (ఏఎంసీ) చైర్మన్ లాల్ సింగ్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. మార్కెట్ పరిధిలో ఏ ఒక్క రైతు లేదా చిన్న వ్యాపారి, లైసెన్స్‌దారు ఇబ్బంది పడకూడదనే స్పష్టమైన ధ్యేయంతో ఆయన ఉన్నట్లు సమాచారం అందుతోంది. ఏ స్థాయి అధికారి లేదా సిబ్బంది పర్యవేక్షణలో ఇలాంటి అవకతవకలు లేదా అదనపు వసూళ్ల ప్రయత్నాలు జరిగాయనే అంశంపై ఆయన లోతుగా సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. చైర్మన్ హోదాలో రైతులకు, పారదర్శక వ్యాపారానికి పూర్తి అండగా ఉంటూ.. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే కఠినమైన చర్యలు తీసుకునేందుకు ఆయన రంగం సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటాం: ఆలీమ్ (ఏడీఎం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)

ట్రేడ్ లైసెన్స్‌ల వ్యవహారంలో వస్తున్న ఆరోపణలు, అదనపు వసూళ్ల ప్రచారంపై జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్ స్పందిస్తూ స్పష్టత ఇచ్చారు. "ఈ అంశంపై మేము ఇప్పటికే సమగ్ర విచారణ జరుపుతున్నాం. ట్రేడ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియలో లేదా మార్కెట్ పరిధిలో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు తేలినా ఊరుకునేది లేదు. పూర్తి స్థాయి విచారణ జరిపి ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులెవరైనా వారిపై చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటాం. నిబంధనల ప్రకారం వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్స్ దరఖాస్తులను, పత్రాలను ఇక్కడ ఉన్న సంబంధిత అధికారులకు సమర్పిస్తే, మా అధికారులే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి (స్క్రూటినీ చేసి) హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో పత్రాలను ఆన్‌లైన్ ద్వారా పంపడానికి వీలుండదు. అధికారులే స్వయంగా స్క్రూటినీ చేసి హైదరాబాద్ పంపే ఈ విధానంలో వ్యాపారులు అదనంగా ఎవరికీ రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. అని ఆయన పేర్కొన్నారు.